క్లుప్తంగా

త్వరలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

సాక్షి ఎఫెక్ట్..

కుప్పం: కుప్పం మున్సిపాలిటీలో కౌన్సిల్ సమావేశం వారం వ్యవధిలో నిర్వహించనున్నట్లు కమిషనర్ శ్రీనివాస రావు తెలిపారు. సోమ వారం సాక్షి దినపత్రికలో 'మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు జరపరా..?' శీర్షికతో ప్రచురించిన కథనంపై ఆయన స్పందించారు. మున్సిపాలిటీలోని 25 వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు, రోడ్లు, మురునీటి కాలువలు అభివృద్ధి కార్యక్రమాలు సంబంధించి నివేదిక అంచనాలు రూపొందించినట్లు తెలిపారు. త్వరలోనే మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించిన వీటిపై చర్చిస్తామని తెలియజేశారు.

వైఎస్సార్‌సీపీ నేత బోరుపైపులు ధ్వంసం


ధ్వంసమైన బోరుపైపులు

పలమనేరు: మండలంలోని పెంగరగుంటకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత వస్రాయగౌడుకు చెందిన బోరుపైపులను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న బాధితుడు సోమవారం ఉదయం దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగా టీడీపీ శ్రేణులే ఈ పని చేసుంటారని బాధితుడు అనుమానం వ్యక్తం చేశాడు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

బైరెడ్డిపల్లి: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఆరోగ్య సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేయాలని వైద్యాధికారి విజయ్‌చంద్ర ఆదేశించారు. సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్య సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. మాతా–శిశుసంరక్షణ, రక్తహీనత నివారణ, గర్భవతుల సేవలు, ఆన్‌లైన్ సేవలు, అతిసారం, కుష్ఠువ్యాధి అనుమానితుల గుర్తింపు సర్వేలను క్రమం తప్పకుండా చేయాలన్నారు. గ్రామాల్లో తరచూ పర్యటించాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. జ్వరపీడితులు ఉన్నపక్షంలో రక్తపరీక్షలు చేయించాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు చందం విద్యార్థులు



కుప్పం రూరల్: స్కూల్ గేమ్స్ షూటింగ్ బాల్ పోటీల్లో చందం ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆ స్కూలు ప్రధానోపాధ్యాయుడు మార్కొండనాయుడు తెలిపారు. సోమవారం రామకుప్పం బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఆవరణలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన 10వ తరగతి విద్యార్థులు శకుంతల, జయ శ్రీ, భానుతేజ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని, ఆగష్టు 10, 11వ తేదీల్లో వి.కోటలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు ప్రాతినిధ్యం వహించనున్నట్లు ఆయన చెప్పారు. క్రీడాకారులను, వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయుడు లోకనాథంను అభినందించారు.

నోట్ పుస్తకాలు పంపిణీ



పుంగనూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో విద్యార్థులకు సోమవారం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అయూబ్‌ఖాన్ నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కమలాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి


మొక్కలు నాటుతున్న ప్రిన్సిపల్ తదితరులు

పుంగనూరు: తమ ఉన్నతికి బాటలు వేసిన డిగ్రీ కళాశాలను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు తమవంతు కృషి చేస్తామని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. సోమవారం ఎన్ఎస్‌పేటలోని శుభారాం డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు, అన్ని హంగులతో అభివృద్ధి చేయడానికి ముందుంటామని పూర్వ విద్యార్థులు చెప్పారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో నందీశ్వర్, విజయ్‌శంకర్, శైలేంద్రకుమార్, విజయకుమారి, గిరిధర్, యుగంధర్ పాల్గొన్నారు.

రేపు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'

కుప్పం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పాల్గొంటారని అధికారులు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారు.

తేరు కావళ్లు లాగుతున్న భక్తులు



పశ్చిమ వాహిని నుంచి కొండపైకి వెళ్తున్న భక్తులు



భక్తులతో కిక్కిరిసిన గుడివంక ఆలయం...



హరోం హర

- భక్తులతో కిటకిటలాడిన గుడివంక
- వివిధ రూపాల్లో కావడి మొక్కులు చెల్లింపు


ఎస్కాట్‌లతో కావడి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

స్వామివారిని క్యూలో దర్శించుకుంటున్న భక్తులు

గుడుపల్లె: గుడివంక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి కొండ ప్రాంతం హరోం హర వేల్ మురుగా.. నామస్మరణతో గుడివంక మార్మోగింది. సోమవారం ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల సందర్భంగా కావళ్లతో వచ్చిన భక్తులు పశ్చిమ వాహినిలో స్నానమాచరించి స్వామి వారి నామస్మరణతో కొండపైకి చేరుకుని మొక్కులు చెల్లించారు. గ్రామీణ ప్రాంతాలలోని భక్తులు ఆడిమాసం ప్రారంభం నుంచి ఆడికృత్తిక వరకు ఉపవాస దీక్షలతో ఉంటూ చివరి రోజున గంగపూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

వివిధ ఆకృతులతో కావళ్లు చెల్లింపు

కోరిన కోర్కెలు నెరవేరిన భక్తులు స్వామి వారికి పలు ఆకృతులతో కావడి మొక్కులు చెల్లించారు. తేరు కావళ్లు, రాగి గుండులు, ఇనుప శూలాలు, నిమ్మకాయలతో సూదులు శరీరానికి గుచ్చుకుని ఆలయం ఎదుట మొక్కులు చెల్లించారు. మరికొందరు భక్తులు ఎస్కాట్ వాహనంపై తమ వీపులకు కొక్కీలు గుచ్చుకుని, గాలిలో వేలాడుతూ ఆరుగురు భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి కావళ్లు చెల్లించారు. భక్తులు స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

భక్తజన సంద్రమైన గుడివంక

కావళ్లు చెల్లించేందుకు పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులతో గుడివంక ఎటుచూసినా జనసంద్రమైంది. క్యూలలో వేచి ఉండి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మొక్కుబడులు ఉన్న భక్తులు ఆలయం ఎదుట కావళ్ల ముడుపులు చెల్లించారు.

ప్రత్యేక అలంకరణలో గంగాధరేశ్వరస్వామి

గుడివంక బ్రహ్మోత్సవాల సందర్భంగా గంగాధరేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కొండపై సుబ్రమణ్యస్వామి దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణంలో భక్తులు గంగాధరేశ్వరస్వామి దర్శించుకుని గ్రామాలకు తిరుగుముఖం పట్టారు.

కుప్పంలో..

కుప్పం: హరో హర నామస్మరణతో కుప్పం సుబ్రమణ్యస్వామి దేవాలయాలు మార్మోగాయి. పట్టణంలోని నేతాజి రోడ్డు, బైపాస్ రోడ్డులోని సుబ్రమణ్యస్వామి దేవాలయంలో సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఆడి నెల ప్రారంభం నుంచి భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని పాటించి భక్తులు ఆడికృత్తిక సందర్భంగా మొక్కులు చెల్లించారు. కావళ్లతోనే కాకుండా రథాలు లాక్కుంటూ వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

పలమనేరు: ఆడికృత్తిక సందర్భంగా పలమనేరు సమీపంలోని టీఎస్ అగ్రహారం సుబ్రమణ్యస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో భక్తులు కావళ్లతో వచ్చి, స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కొండపై కొలువున్న సుబ్రమణ్య స్వామి ప్రధాన ఆలయం భక్కులతో సందడిగా మారింది. కిందనున్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి, నాయకులు హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు వీరికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. భక్తులకు అన్నదానం చేశారు. అలాగే పట్టణంలోని శివాలయం, మొరం అంజనాద్రి, కూర్మాయి గ్రామాల్లోనూ ఆడికృత్తిక పూజలు ఘనంగా చేశారు.

ఘనంగా ఆడికృత్తిక

పెద్దపంజాణి: మండలంలోని వీరప్పల్లె యోగనందీశ్వర స్వామి, నాగిరెడ్డిపల్లె పంచాయతీ మునీశ్వర స్వామి, కోగిలేరు సమీపంలోని జలకంఠేశ్వరస్వామి ఆలయాలలో సోమవారం ఆడికృత్తిక ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. జలకంఠేశ్వరాలయం సమీపంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి, యోగనందీశ్వర స్వామి ఆలయంలో బాల సుబ్రమణ్యస్వామి, మునీశ్వర స్వామి ఆలయంలో సుబ్రమణ్యస్వామి మూలవిరాట్టులకు రుత్వికులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాలపుష్పాలతో స్వామి వారిని విశేషంగా అలంకరించి దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు కావళ్లు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఉచిత తీర్థప్రసాదాలు అందజేశారు.

నెల్లిపట్లలో..

బైరెడ్డిపల్లె: మండలంలో నెల్లిపట్ల సమీపంలోని దేవరకొండపై ఉన్న సుబ్రమణ్యస్వామి ఆలయంలో సోమవారం ఆడికృత్తిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాల అనంతరం కలశస్థాపన, ధ్వజారోహణం, నెమలి వాహనోత్సవం, ఉయ్యాల సేవ తదితర కార్యక్రమాలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఉభయదారులుగా రామచంద్రారెడ్డి, దొరస్వామి, బాలాజి, వాసు, మునిరత్నం, పుష్పలత వ్యవహరించారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: స్థానిక బజారువీధిలోని శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ పరిసర ప్రాంతాలు భక్తుల హరోం...హర నామస్మరణతో మార్మోగాయి. సోమవారం ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీషణ్ముఖ సుబ్రమణ్యస్వామివారిని అర్చకులు ప్రత్యేకంగా రంగు రంగుల పూలు, విద్యుత్ దీపాలతో ముస్తాబుచేశారు. స్వామివారికి విశేష పూజలు చేశారు. కొత్తవీరప్పల్లె యోగనందీశ్వరస్వామి ఆలయంలోని బాలసుబ్రమణ్యంస్వామి ఆలయంలో భక్తులు కావడి మొక్కులు చెల్లించారు. పురుషోత్తంరాజు పర్యవేక్షణలో అన్నప్రసాదాల వితరణ చేశారు. కొందరు భక్తులు నోటిలో నాలుకపై శూలాలు గుచ్చుకుని కావళ్లతో మొక్కులు చెల్లించారు.


కుప్పం: ప్రత్యేక అలంకరణతో సుబ్రమణ్యస్వామి


.కుప్పం: భక్తులకు అన్నదానం


పలమనేరు: కావడి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

పార్టీ బలోపేతానికి శ్రమిద్దాం

- ఎన్ని ఇబ్బందులు పెట్టినా తట్టుకుని నిలబడదాం
- సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు గిరిరాజారెడ్డి

గంగవరం: పాలకుల కక్షసాధింపు చర్యలను ధైర్యంగా ఎదుర్కొంటూనే పార్టీ బలోపేతానికి శ్రమిద్దామని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు గిరిరాజారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని కొత్తపల్లె గ్రామ సచివాలయంలోని తన చాంబర్‌లో ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ. సూపర్‌సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని వందశాతం నెరవేర్చాలని, నెరవేర్చలేని పక్షంలో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగాన్ని టీవీలో విన్నాక సూపర్‌సిక్స్ అమలు చేస్తారా? అనే అనుమానాలు ప్రజల్లో వస్తున్నాయన్నారు. కూటమి ప్రభుత్వంలోకి వచ్చీరాగానే వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, సానుభూతిపరులపై ఇప్పటికీ దాడులు చేస్తోందని, ఆస్తులు ధ్వంసం చేయడం, హత్యాకాండలకు తెగబడుతోందని దారుణమని, దీనిపై కూటమి నేతలు పెదవి విప్పకపోవడం శోచనీయమని నిరసించారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నాయకులు చంద్రప్ప, చలపతిరెడ్డి, చిట్టి, రఘు, కొండయ్య, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

పట్టు వస్త్రాల సమర్పణ


పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న సుధీర్ రెడ్డి


అలంకారంలో వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి

సదుం: స్థానిక వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తరపున ఆయన సోదరుని కుమారుడు పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి, బందార్లవారిపల్లెకు చెందిన భాస్కర్ రెడ్డి దంపతులు సోమవారం పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని స్వామి వారి శేష వస్త్రంతో సన్మానించారు. భరణి సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు కావిళ్లతో మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కృష్ణారెడ్డి, మల్ రెడ్డి, వెంకటరమణా రెడ్డి, మోహన్ రెడ్డి, కమ్మిరెడ్డి, నారాయణరెడ్డి, మురళి, శ్రీధర్, నారాయణ, అజయ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాణేల ప్రదర్శన


పుదిపట్ల ఉన్నత పాఠశాలలో నాణేల ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు


పురాతన నాణేలు

చౌడేపల్లె: పురాతన నాణేలు కూడా ఎంతో చరిత్రను తెలియజేస్తాయని, వీటి గురించి భావితరాలకు తెలియజేయడమే తన లక్ష్యమని నాణేల సేకరణదారుడు సాయికృష్ణ తెలిపారు. సోమవారం మండలంలోని పుదిపట్ల ఉన్నత పాఠశాల ఆవరణలో పురాతన నాణాలను, విదేశీ కరెన్సీల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. స్థానిక కోనేటిపాళ్యంకు చెందిన సాయికృష్ణ 5వ తరగతి చదువుతున్నప్పటి నుంచి తన తల్లిదండ్రులు మంజుల, రవికుమార్ స్ఫూర్తితో 12 ఏళ్లుగా నాణేల సేకరణే వ్యాపకంగా పెట్టుకున్నారు. వివిధ రాజుల కాలంలోని వినియోగించిన 26 రకాల నాణేలు, బ్రిటీష్ పాలనలోని నాణేలు, రిపబ్లిక్ పాలనలో ఉన్న ప్రస్తుత కరెన్సీ, రద్దు చేసిన 500, 1000 నోట్లతో సహా 96 విదేశాలకు చెందిన కరెన్సీని ప్రదర్శనలో ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం హెచ్ఎం పద్మజ, ఉపాధ్యాయులు సాయికృష్ణను సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

నేటి నుంచి కల్యాణ వెంకన్న పవిత్రోత్సవాలు

పుంగనూరు: స్థానిక కోనేటి వద్ద ఉన్న శ్రీకళ్యాణ వెంకట్రమణస్వామి ఆలయంలో మంగళవారం అంకుర్పారణతో పవిత్రోత్సవాలకు శ్రీకారం చుడుతున్నట్టు దేవదాయశాఖ అధికారులు తెలిపారు. 31న యాగశాల, కైంకర్యాలు, 1న పవిత్ర సమర్పణ, 2న స్నపన తిరుమంజనం, పూర్ణాహుతితో పాటు ఈఏడాదిలో తెలియకచేసిన కొన్ని దోషాల నివారణకు ఆగమ శాస్త్రప్రకారం పవిత్రోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తామని, సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు నాలుగు మాడవీధులలో భక్తులకు దర్శనమిస్తారని తెలియజేశారు.

విభూది అలంకారంలో చాముండేశ్వరి



పుంగనూరు: పట్టణంలో తూర్పుమొగశాలలోని శ్రీచాముండేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న జయంతి వేడుకల్లో సోమవారం అమ్మవారు విభూది అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో హోమాది కార్యక్రమాలు అభిషేకాలు, అర్చనలు తదితర కైంకర్యాలను వేదపండితుల శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే ఆలయంలో చాముండేశ్వరిదేవి కీర్తనలు ఆలపించారు.

కేంద్ర బడ్జెట్ ప్రతులను దగ్ధం చేసి నిరసన

పలమనేరు: కేంద్ర బడ్జెట్ సామాన్యులను మోసం చేసి పెట్టుబడిదారులకు మేలు చేసేలా ఉందని నిరసిస్తూ స్థానిక వ్యవసాయ కార్మిక సంఘ కార్యాలయం వద్ద కేంద్ర బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. సంఘ జిల్లా కార్యదర్శి ఓబులురాజు మాట్లాడుతూ, కేంద్రం మరోసారి రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందన్నారు. ఇంత చేసినా కూటమి ప్రభుత్వం కనీసం నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. ఉపాధి హామీకి సంబంధించి పెండింగ్‌లోని రూ.330 కోట్లు కూడా కేంద్రం ఇవ్వలేదని, దీనిపై కూటమి నాయకులు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. మొత్తం మీద అమరావతికి అప్పు ఇచ్చి రాష్ట్రానికి మోసం చేసిందన్నారు. నిరసనలో సుబ్రమణ్యం, రామ్మూర్తి, వెంకటముని పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం

-కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్


వినతులు స్వీకరిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం: ప్రజా సమస్యలపై అందిన ప్రతి ఫిర్యాదునూ పరిశీలించి పరిష్కరిస్తామని కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాయంలో ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 42 ఫిర్యాదులు రాగా, వాటిలో 10 రెవెన్యూ శాఖకు సంబంధించినవి ఉన్నాయన్నారు. వీటిని ఆయా శాఖల అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రధానంగా రెవెన్యూ శాఖ సంబంధించి ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని, వీటిపై నియోజకవర్గంలోని నాలుగు మండలాల రెవెన్యూ అధికారులు సమీక్షించినట్టు తెలిపారు. అలాగే వ్యక్తిగత సమస్యలు, ఇతరత్రా శాఖా పరమైన సమస్యల పరిష్కారానికి కూడా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

సకాలంలో పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు


మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంగమునిరెడ్డి

పుంగనూరు: ఆగస్టు 1న సామాజిక పెన్షన్లు పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీడీఓ వెంగమునిరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆగస్టు 1న ఉదయం 6 నుంచి లబ్ధిదారులకు పెన్షన్ల పంపిణీ చేయాలని, సాయంత్రం వేళకు 90 శాతం పంపిణీ చేయాలని వెల్ఫేర్ అసిస్టెంట్లు, కార్యదర్శులను ఆదేశించారు. అలాగే గ్రామాలలో మురుగునీటి కాలువలు శుభ్రపరచడంతో పాటు బ్లీచింగ్ చల్లించాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతివారం క్లోరినేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఓపీఆర్‌డి శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన సినారె


సినారె చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సభ్యులు

పలమనేరు: తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన వ్యక్తి సి.నారాయణ రెడ్డి అని స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు అన్నారు. స్థానిక కళా మందిరంలో సినారే జయంతిని సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన సేవలను స్మరించారు. ఆయన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి ఎన్నో సాహితీ పురస్కారాలను అందుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి పుష్ప, శ్రీరామచంద్రమూర్తి, మాధవరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భరణి కావళ్లు


జెడ్పీ చైర్మన్‌కు స్వాగతం పలుకుతున్న ఆలయ కమిటీ సభ్యులు

వి.కోట: భరణి పురస్కరించుకుని సోమవారం మండలంలోని సుబ్రమణ్యస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కావడి మొక్కులు చెల్లించారు. మండలంలో బీసీపల్లె పంచాయతీలోని సీవీఆర్ కొండపై ఉన్న సుబ్రమణ్య స్వామి దేవాలయాన్ని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తొలుత ఆయనను ఆలయ కమిటీ సభ్యులు శాలువతో సత్కరించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు గోపిరెడ్డి, సర్పంచ్ జయప్ప, ఎంపీటీసీ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.